హెల్మెట్ ధారణ.. ప్రాణ రక్షణ

- 'నో హెల్మెట్.. నో ఎంట్రీ' తో సత్ఫలితాలు
- స్టీల్‌ప్లాంట్‌లో రోడ్డు ప్రమాదాల్లో తగ్గిన మృతుల సంఖ్య



ఉక్కు మెయిన్ గేటులో హెల్మెట్‌తో ప్రయాణిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో హెల్మెట్ ధారణను తప్పనిసరి చేస్తూ జారీ చేసిన ఆదేశాలు సత్ఫలితాల నిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గింది. శరీరంలోని చేతులు, కాళ్లు, నడుము ఇలా ఇతర భాగాలకు తీవ్ర గాయాలైనా శస్త్రచికిత్సతో కోలుకోవచ్చు .. గానీ తల భాగంలో అత్యంత సున్నితమైన మెదడుకు హాని కలిగితే మనిషి ప్రాణాలు కోల్పోవడమో.. లేదా జీవితాంతం కోమాలో ఉండటమో జరుగుతుంది. ఈ నేపథ్యంలో హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నాయి. అయినప్పటికీ కొందరు అతి విశ్వాసం, నిర్లక్ష్యం కారణంగా హెల్మెట్ ధరించేందుకు నిరాసక్తత చూపడంతో ప్రమాదాల్లో చిక్కుకోవడం చూస్తూనే ఉన్నాం. ఈ అంశంపై విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలుస్తూ తమ ఉద్యోగులు దాదాపు 90 శాతం పైగా హెల్మెట్ ధరించేలా చేయడంలో విజయం సాధించింది.

విస్తృతంగా అవగాహన
స్టీల్‌ప్లాంట్ తొలుత యువ ఉద్యోగులతో ప్రారంభమైంది. ప్రతీ ఒక్కరూ ద్విచక్ర వాహనాలు కలిగి ఉండేవారు. యువకులు కావడంతో వేగంగా వెళ్లడం.. ప్రమాదాలు జరగడం.. కొంతమంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఈ క్రమంలో యాజమాన్యం హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై వివిధ రకాల పోటీలు నిర్వహించడం ద్వారా అవగాహన కార్యక్రమాలు ప్రారంభించింది. తర్వాత వివిధ కూడళ్లలో హెల్మెట్ ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. పూర్తి స్థాయి అమలు కార్యక్రమంలో భాగంగా స్టీల్‌ప్లాంట్ పూర్వ డైరెక్టర్ (పర్సనల్) వై.ఆర్. రెడ్డి ఆదేశాల మేరకు 'నో హెల్మెట్ – నో ఎంట్రీ' ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్లాంట్‌లోకి ప్రవేశించాలంటే హెల్మెట్ ధరించాలన్న నినాదం ఉద్యోగుల్లోకి చొచ్చుకు పోయింది. కేవలం వారం రోజుల్లో నూరు శాతం ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు హెల్మెట్ ధరించడం ప్రారంభమైంది. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో హెల్మెట్ ధరించడం ఒక సంస్కృతిలా మారింది. స్పాండిలైటిస్ వంటి సమస్యలు ఉన్నవారు తప్ప ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరిస్తున్నారు. ఉక్కు భద్రతా విభాగం అధికారుల సమాచారం మేరకు హెల్మెట్ ధారణ పెరిగిన తర్వాత రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య లేకుండా పోయింది.

ఉక్కు ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం



స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఉక్కునగర వాసులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉక్కు భద్రతా విభాగం వివిధ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా క్రాష్ హెల్మెట్ క్యాంపెయిన్లు, వేగ నియంత్రణ చర్యలు, పోలీసు పెట్రోలింగ్ తదితర చర్యలు చేపడుతున్నాం.
–ఎం. వరప్రసాదరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్, ఉక్కు భద్రతా విభాగం

ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై అవగాహన


ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారులు

కూర్మన్నపాలెం: ప్రైవేట్ పాఠశాలల నిర్వహణకు సంబంధించి మండల విద్యాశాఖాధికారులు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కూర్మన్నపాలెం నిర్మల స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ సదస్సుకు గాజువాక మండల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు హాజరయ్యారు. ఎంఈవో సునీత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల నిర్వహణపై అధికారులు వివరాలు తెలియజేశారు. మారిన విధానంలో అడ్మిషన్ రికార్డు రాసే విధానం, విద్యార్థులకు టీసీలు ఇచ్చే పద్ధతి, హాజరు నమోదు ప్రక్రియ, స్కూల్ నిర్వహణలో ఏ రికార్డులు ఎలా రాయాలో వివరించారు. అనంతరం ఉప విద్యా శాఖాధికారి ఎ.గౌరీశంకరరావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు, రెన్యువల్ ప్రక్రియను కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వం సూచించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలని, సెలవులు తు.చ తప్పకుండా పాటించాలని తెలికజేశారు. కార్యక్రమంలో జిప్సా అధ్యక్షుడు పి.భాస్కరరావు, ఎంఈవో విశ్వనాధం, అగనంపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, సీఆర్పీలు, జిప్సా కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ప్రతినిధులు సుమారు 80 మంది పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు మరో అడుగు


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు పరిరక్షణకు మరో అడుగు వేస్తూ ఉత్తరాంధ్రలో బైక్ యాత్రను నిర్వహిస్తున్నామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఉద్యమంలో ప్రజలను భాగస్వాములు చేసే ఆలోచనతో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ యాత్ర ఈ నెల 29 వరకు ఉత్తరాంధ్రలోని 6 జిల్లాల్లో 1150 కిలోమీటర్ల మేర నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 951వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బైక్ యాత్రలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, ఉక్కు పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఉక్కు ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను వెనక్కి తీసుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకుల, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగా కేంద్రం ప్రారంభం


యోగాసనాలు సాధన చేస్తున్న విద్యార్థులు

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాన్ని ఆంధ్రా యూనివర్సిటీ యోగా విలేజ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఒ.ఎస్.ఆర్.యు.భాను కుమార్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో గుర్తించబడిన పూర్వకాల భారతీయ ఆరోగ్య రహస్యం యోగా అన్నారు. యోగాను శాస్త్రీయంగా అభ్యసించడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనంతరం యోగా గురు నరేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాల మెలకువలను నేర్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, కళాశాల ప్రిన్సిపాల్స్ ఎ.బాలకృష్ణ, ఎస్.వి.కృష్ణ, వై.ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

లభించని బాలుడి ఆచూకీ

పెదగంట్యాడ: యారాడ తీరంలో సోమవారం గల్లంతైన బాలుడు కల్యాణ్ కుమార్(16) ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం సాయంత్రం వరకు కోస్టుగార్డు సిబ్బందితో పాటు నేవీ సబ్బంది సముద్రంలో డ్రోన్ కెమెరాలతో గాలించినా ఫలితం లేకపోయిందని న్యూపోర్టు పోలీసులు తెలిపారు. గురువారం మరోసారి గాలింపు చర్యలు చేపడతామన్నారు.

పాతకర్ణవానిపాలెంలో దోమల నివారణకు చర్యలు


నీటి నిల్వలను తనిఖీ చేస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్

గాజువాక: జీవీఎంసీ గాజువాక ప్రజారోగ్య విభాగం సిబ్బంది స్థానిక పాతకర్ణవానిపాలెంలో బుధవారం యాంటీ లార్వా ఆపరేషన్ డ్రైవ్ నిర్వహించారు. గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మలేరియా విభాగం సిబ్బందితో కలిసి పాతకర్ణవానిపాలెంలో ఫాగింగ్ చేశారు. ఆ ప్రాంతంలోని నీటి నిల్వలను తనిఖీ చేసి దోమల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ ప్రాంతంలో ఒక వ్యక్తికి డెంగ్యూ పాజిటివ్ రావడంతో అప్రమత్తమై ప్రత్యేక చర్యలను చేపట్టినట్టు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు.

జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు రాజు


సబ్ రిజిస్ట్రార్ రాజు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ స్థాయి సివిల్ సర్వీస్ లాన్ టెన్నిస్ పోటీలకు షీలానగర్‌లోని గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ కె.రాజు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభను కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ లాన్ టెన్నిస్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి మెన్ విభాగంలో తనను ఎంపిక చేసినట్లు తెలియజేశారు.

పోస్టల్ శాఖ సేవలపై అవగాహన

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలో తపాలా శాఖ ఆధ్వర్యంలో బుధవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తపాలా శాఖ సీనియర్ మేనేజర్ కె.శ్రీదేవి మాట్లాడుతూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో తక్కువ ప్రీమియంతో అధిక బోనస్ ఇచ్చే ప్లాన్స్ ఉన్నాయని తెలిపారు. చిన్న చిన్న మొత్తాల్లో పొదుపు జమ చేసి భవిష్యత్ అవసరాలకు పెద్ద మొత్తంలో అందుకునేలా చాలా రకాల పొదుపు పథకాలు ఉన్నాయన్నారు.

వ్యాయామం, పోషకాహారంతో అల్జీమర్స్‌కు చెక్

అక్కిరెడ్డిపాలెం: మెదడులో కణాలు చనిపోతుండటం వల్ల వచ్చే నాడీ సంబంధిత వ్యాధి అల్జీమర్స్ అని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సీహెచ్.విజయ్ అన్నారు. పోషకాహారం, నిత్యం వ్యాయామంతో ఈ వ్యాధికి చెక్ పెట్టవచ్చన్నారు. సెప్టెంబర్ 21న అంతర్జాతీయ అల్జీమర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అల్జీమర్స్ వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచన సామర్థ్యం దెబ్బ తింటాయన్నారు. జరిగిన విషయాలు మర్చిపోయి చివరకు ఆ వ్యక్తి తానేవరో తెలియని స్థాయికి ఈ మతిమరుపు వ్యాధి విస్తరిస్తుందన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా వయసు పైబడుతున్న వారిలో కనిపిస్తుందని చెప్పారు. ప్రపంచంలో ఎంతో మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. మంచి పోషకాహారాలు, నట్స్ వంటివి తీసుకోవడం వంటి మెదడు చురుగ్గా పనిచేస్తూ ఉండటంతో పాటు నిత్యం వ్యాయామం చేస్తూ ఉంటే మంచిదని వివరించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వినతి


హెచ్‌ఆర్ సీజీఎం గాంధీతో మాట్లాడుతున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ప్రతినిధులు కోరారు. బుధవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి. గాంధీని కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రూ. 21 వేలు దాటిన కార్మికులకు బోనస్, హెల్త్ కార్డులు, వర్క్‌మెన్ కాంపెన్సేషన్ అంశాలను పరిష్కరించాలని కోరారు. సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని సీజీఎం హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పిట్టా రెడ్డి, శశిభూషణరావు, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, పి.భాస్కరరావు, వంశీ, తిప్పల గుర్నాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం


ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గాజువాక: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 'నారీశక్తి వందన్ అధినియమ్' పేరుతో తీసుకొచ్చిన మహిళా బిల్లుపై గాజువాక బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో పాతగాజువాకలో ర్యాలీ నిర్వహించి మిఠాయిలను పంచిపెట్టారు. అనంతరం కరణంరెడ్డి మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చారిత్రాత్మక బిల్లును తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు రోహిణి, జీలకర్ర భువనేశ్వరి, అనిత, రాజులమ్మ, బాటా శ్రీనివాస్, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, రాజశేఖర్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి గీతాలపై పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సాహితి స్రవంతి ప్రతినిధులు

మురళీనగర్: మహాకవి గురజాడ అప్పారావు జయంతి వారోత్సవాల సందర్భంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో సాహితీ స్రవంతి సంస్థ, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన 'గురజాడ ఆశించిన సమాజం ఫలించిందా?' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. విజేతలు పి.దిలీప్, ఎన్. ఎల్.ఎస్. వర్ధన్, టి.వైష్ణశ్రీ ,ఇ.రవళి , వై.వందనకు సాహితీ స్రవంతి ప్రతినిధులు, ప్రిన్సిపాల్ వెంకటరమణ బహుమతులను అందజేశారు. వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి గురజాడ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, సాహితీ స్రవంతి సభ్యులు ఎం.ఆనంద శర్మ, ఆంథోని, వెంకట్, వసంతకుమార్, పి.ఫ్రాన్సిస్, పి.రామారావు పాల్గొన్నారు.

ఆయుష్ గణపతిని దర్శించుకున్న మంత్రి సీదిరి


ఆయుష్ గణపతి వద్ద మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు

అక్కిరెడ్డిపాలెం: గ్లోబెక్స్ వద్ద గల సీఎంఆర్ స్థలంలో ఏర్పాటు చేసిన 112 అడుగుల భారీ ఆయుష్ గణపతిని రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు బుధవారం దర్శించుకున్నారు. మంత్రి దంపతులను గణపతి సేవా సంఘం అధ్యక్షుడు బచ్చల త్రిమూర్తులు తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా చినతల్లి, గుర్రం రాజేష్, సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గణేశుడి సన్నిధిలో అన్నసమారాధన


అన్న సమారాధనను ప్రారంభిస్తున్న దేవన్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని పిండిమిల్లు పక్కనున్న డెయిరీ కాలనీలో వినాయక పూజా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం వరసిద్ధి వినాయకుడి సన్నిధిలో భారీ అన్నసమారాధనను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్ రెడ్డి అన్నసమారాధనను ప్రారంభించారు. ఐదు వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి సంద్రాన నూకరాజు, పూజా కమిటీ ప్రతినిధి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ పీజీ కోర్సుల దరఖాస్తుకు గడువు పొడిగింపు

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా గతంలో ప్రకటించిన హెల్త్ కేర్ పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు పొడిగిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, పీజీ డిప్లొమా ఇన్ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ టెక్నాలజీ, క్రిటికల్ కేర్ టెక్నాలజీ కోర్సులకు ఏదైనా పీజీ మరియు బీఎస్సీ బయాలజీ, నర్సింగ్ లేదా ఏదైనా వైద్య సంబంధిత డిగ్రీ చేసిన విద్యార్థులు అర్హులని తెలియజేశారు. మరిన్ని వివరాలు www. audoa.in వెబ్ సైట్‌లో ఉంటాయని తెలిపారు. లేదా బొల్లినేని మెడ్ స్కిల్స్, కిమ్స్ ఐకాన్ హాస్పటల్‌లో సంప్రదించాలని సూచించారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 72079 53919, 76809 45357 నంబర్లకు గానీ, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఆవరణలోని తమ సంస్థలోగానీ సంప్రదించాలని కోరారు.

గణనాథుడికి చిన్నారుల నృత్యాంజలి


బాల వినాయక స్వామి ఆలయంలో భరతనాట్యం చేస్తున్న చిన్నారులు

అక్కిరెడ్డిపాలెం: గణనాథుడికి చిన్నారులు నృత్యాంజలి సమర్పించారు. వినాయక చవితిని పురస్కరించుకుని భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ వినాయక, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం చిన్నారుల నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. బాల వినాయక స్వామి ఆలయంలో శ్రీహరిపురానికి చెందిన చిన్నారుల ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. గాయత్రి నృత్యం అలరించింది.

విశేషంగా దీపారాధన


మంచు శివలింగం చుట్టూ ఏర్పాటు చేసిన దీపాలు

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలో కాలనీ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్, యువత ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా విశేషంగా దీపారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంచు శివలింగం ఆకట్టుకుంది. 1008 దీపాలతో ఏర్పాటు చేసిన దీపారాధనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

భవనాల సంరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం

- కాలానుగుణంగా తక్షణ చర్యలకు అవకాశం
- ప్రత్యక్ష అవగాహనకు దోహదం


పురాతన ఇంజినీరింగ్ కళాశాల భవనం


ఇటీవల నిర్మించిన ఏయూ సిబ్ భవనం

ఏయూ క్యాంపస్: సువిశాలమైన 500 ఎకరాలకు పైగా విస్తీర్ణం .. 260కు పైగా భవనాలు ఆంధ్ర విశ్వవిద్యాలయం సొంతం. వీటిలో కొన్ని రాతితో.. మరికొన్ని నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన సిమెంట్ భవనాలు ఉన్నాయి. ఇటీవల కొత్తగా పదికి పైగా భవనాలు నిర్మించడంతో పాటు, మరో 10 పాత భవనాలను పూర్తి స్థాయిలో మరమ్మతులు పూర్తి చేసి కొత్తవాటిలా తీర్చిదిద్దారు. ఈ భవనాల నిర్వహణ.. సంరక్షణ.. అవసరమైన సమయంలో మరమ్మతులు చేపట్టడం వర్సిటీకి ప్రత్యేక వ్యవస్థ అవసరం ఏర్పడింది. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఏయూ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ముగ్గురు విద్యార్థులతో బృందాలు
వర్సిటీలోని సివిల్, ఆర్కిటెక్చర్, జియో ఇంజినీరింగ్ విభాగాల విద్యార్థులను బృందాలుగా ఏర్పాటు చేస్తారు. ఒక్కో విభాగం నుంచి ఒక్కో విద్యార్థిని భాగం చేస్తూ ముగ్గురితో ఒక బృందం ఏర్పాటు చేసి ఒక్కో భవనాన్ని కేటాయిస్తారు. ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలోకి వచ్చిన విద్యార్థికి అవకాశం ఇస్తారు. దీని వల్ల సుమారు మూడు సంవత్సరాల కాలం ఒక భవన నాణ్యత, ప్రమాణాల పరిరక్షణ, అవసరమైన మరమ్మతులు చేపట్టడం వంటి పనులపై విస్తృత అవగాహన పొందే అవకాశం కలుగుతుంది. భవనం నాణ్యత, అంతర్గతంగా ఏర్పడే సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేస్తారు. దీనిని పరిశీలించిన ఇంజినీరింగ్ కార్యాలయం సిబ్బంది వెంటనే పునరుద్ధరణకు అవకాశం ఏర్పడుతుంది. అదే సమయంలో భవనానికి సంబంధించిన సమగ్ర సమాచారం యాప్‌లో భద్రంగా ఉంటుంది. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలకు మెరుగైన పరిష్కారాలు చూపడానికి ఒక డేటా బ్యాంక్‌గా కూడా పని చేస్తుంది.

ప్రత్యక్ష ఆచరణకు అవకాశం
తరగతి గదిలో నేర్చుకునే అంశాలను విద్యార్థులు ప్రత్యక్షంగా ఆచరణలో చూపే అవకాశం ఏర్పడుతుంది. విద్యార్థికి కేటాయించిన భవనంలో వారంలో ఒక రోజు భవనాన్ని పరిశీలించి స్ట్రక్చరల్, నాన్ స్ట్రక్చలర్ క్రాక్స్ వంటివి పరిశీలిస్తారు. ఫ్లోర్ సెటిల్‌మెంట్, ప్లింత్ బీమ్‌లో సమస్యలు వంటివి గుర్తించి తెలియజేస్తారు. భవన పటిష్టతను గుర్తించడానికి ఎన్‌డీటీ టెస్టులు చేస్తారు. వీటిలో సైతం విద్యార్థులు భాగస్వాములు అవుతారు. భవనానికి మరమ్మతులు చేపట్టే సమయంలో కూడా విద్యార్థులను భాగస్వామ్యం చేస్తారు. ఈ నూతన ప్రాజెక్ట్ విద్యార్థులకు ఒక ప్రత్యక్ష ప్రయోగశాలగా దోహదపడుతుంది.

ఇంటర్న్‌షిప్‌గా పరిగణన



విద్యార్థులు వర్సిటీలో ప్రత్యక్షంగా నేర్చుకుంటూ, వర్సిటీ ప్రగతిలో భాగం అయ్యే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తాం. దీనిని ఇంటర్న్‌షిప్‌గా పరిగణిస్తూ, విద్యార్థికి సర్టిఫికెట్ అందించే ఆలోచన ఉంది. ఇంజినీరింగ్ పూర్తి చేసే సమయానికి మంచి నైపుణ్యాలు అలవడతాయి.
– ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, వీసీ, ఏయూ